సాక్షి నిజామాబాద్

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



సీతారాములు, లక్ష్మణుడు, హనుమ వేషధారణలో చిన్నారులు



విజయయాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

న్యూస్‌రీల్

డిగ్రీ ప్రాక్టికల్స్ బహిష్కరిస్తాం

- ప్రైవేట్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 16 నుంచి నిర్వహించే డిగ్రీ ప్రాక్టికల్స్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల విషయమై ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న జాప్యంతో ప్రైవేట్ కళాశాలల భవనాల అద్దెలు చెల్లించలేక, లెక్చరర్ల జీతభత్యాలు ఇవ్వలేక యాజమాన్యాల బతుకులు అగమ్యగోచరంగా మారాయన్నారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ డిగ్రీ ప్రాక్టికల్స్ బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు తెయూ రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారికి లేఖ అందజేసినట్లు పేర్కొన్నారు.

పసుపు రైతుల స్టాల్‌ను సందర్శించిన మంత్రి



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన రైతు మహోత్సవ మేళాలో జిల్లా తరఫున జీఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సందర్శించారు. విలువ ఆధారిత పసుపు ఉత్పత్తులను చూసి రైతులను అభినందించారు. ఈ నెలలోనే నిజామాబాద్‌లో కూడా రైతు మహోత్సవ మేళాను ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా రైతులు పండించిన పసుపును జీఎంకేపీఎం అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో వారాహమూఖి ఎఫ్‌పీవో ఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఫెడరేషన్ కార్యదర్శి ఏవీ రావు, జీఎంకేపీఎం సూపర్‌వైజర్ కంతం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నందిపేట పోలీస్ స్టేషన్ తనిఖీ



నందిపేట్ (ఆర్మూర్): పోలీస్ కమిషనర్ సాయిచైతన్య నందిపేట పోలీస్ స్టేషన్‌ను శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సై చిరంజీవితో మాట్లాడి నందిపేట, డొంకేశ్వర్ మండలాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. రెండు మండలాల ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, కమ్యూనల్ షీట్స్‌పై నిఘా ఉంచాలని సూచించారు. దొంగతనాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి ప్రశ్నించారు.



హనుమంతుడు, శ్రీరాముని భారీ విగ్రహాలు

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా కొనసాగుతున్న విజయయాత్ర

ఇందూరు గడ్డపై వీర హనుమాన్



విజయయాత్రలో గుర్రాలపై వస్తున్న యువకులు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న హిందూవాహిని ప్రతినిధులు, నాయకులు

విజయయాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా వీర హనుమాన్ విజయయాత్ర ఇందూరు గడ్డపై శోభాయమానంగా సాగింది. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తోపాటు హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విజయయాత్రతో నగరం కాషాయమయమైంది. కంఠేశ్వర్‌లోని నీలకంఠేశ్వరాలయం వద్ద శనివారం ఉదయం 11.45 గంటలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ విజయయాత్రను ప్రారంభించారు. జిల్లా పరిషత్, నాందేవ్‌వాడ, శివాజీచౌక్, గంజ్, దేవీరోడ్డు, గాంధీచౌక్, పెద్దబజార్ మీదుగా ఆర్‌ఆర్ చౌరస్తాలోని శివాజీ విగ్రహం ప్రాంతానికి రాత్రి 8.30 గంటలకు చేరుకుంది. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నుడా చైర్మన్ కేశ వేణు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, కాంగ్రెస్ నాయకుడు రత్నాకర్‌తోపాటు యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. – నిజామాబాద్ రూరల్



విజయయాత్రలో నృత్యం చేస్తున్న యువకులు



నృత్యం చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



గాంధీ చౌక్‌లో కొనసాగుతున్న విజయయాత్ర



బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ సాయిచైతన్య, ఏసీపీ రాజవెంకటరెడ్డి

హిందువుగా పుట్టడం అదృష్టం



ప్రసంగిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: హిందువుగా పుట్టడం అదృష్టంగా భావించాలని, ఇందూరు గడ్డపై హిందుత్వం ఎంత బలంగా ఉందో విజయయాత్రతో మరోసారి నిరూపితమైందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలో శనివారం రాత్రి నిర్వహించిన ముగింపు సభకు ముఖ్యఅతిథిగా అర్వింద్ హాజరై మాట్లాడారు. హిందూ ధర్మానికి రక్షణ కవచంగా ఆంజనేయస్వామిని భావిస్తామన్నారు. సనాతన ధర్మం గొప్పదని, హిందువులందరం ధర్మం, దేశాన్ని కాపాడుకోవడానికి ఒక్కటిగా నిలబడాలని పిలుపునిచ్చారు.

శంభుని గుడి కబ్జాలను తొలగిస్తాం

నగరంలోని శంభునిగుడి వద్ద కబ్జాలను తొలగించి తీరుతామని, అందుకు హిందూ బంధువులందరి సహకారం కావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఎక్కడైనా దేవాలయాలకు నష్టం కలిగిస్తే హిందువులంతా సంఘటితమై అక్కడికి చేరుకోవాలని, ఇందూరులోని శంభుని గుడి, ఖిల్లా రామాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. యాత్రలో పాల్గొని జయవంతం చేసిన ప్రతి హిందువుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. హిందూ సంఘాల ప్రతినిధులు కాపర్తి గురుచరణం, గుమ్ముళ్ల సత్యం, తమ్మల కృష్ణ, కిరణ్ తోటావార్, రెంజర్ల నరేశ్, బ్రహ్మానంద సరస్వతి, ఇప్పకాయల హరిదాసు, దినేశ్ ఠాకూర్, కమ్మరి లక్ష్మణ్, ధాత్రిక రమేశ్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, హిందూవాహిని ప్రతినిధులు పాల్గొన్నారు.



ముగింపు సభకు హాజరైన ప్రజలు



ప్రసంగిస్తున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

ఆదాయంపైనే దృష్టి!

- ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు జమ చేయించుకుంటున్న ప్రభుత్వం
- జిల్లాలో ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం రూ.46.23 కోట్లు జమ

మోర్తాడ్(బాల్కొండ): లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం అమలు చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం మూడు దశల్లో దరఖాస్తులను పరిశీలించిన తరువాత ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును వసూలు చేయాలి. అయితే ఆదాయం దండిగా ఉండడంతో అసలు విషయాన్ని మరిచి ఫీజు వసూలుపైనే దృష్టి సారించిన ప్రభుత్వం ఇప్పుడిప్పుడే దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయిస్తుండటం గమనార్హం. ఈనెల 30వ తేదీ వరకూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజులో 25 శాతం రాయితీని పొందే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో 15,212 దరఖాస్తుల ద్వారా రూ.46.23 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరింది. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తుల సంఖ్య 20వేలకు మించి ఉంటుందని అంచనా.

ఇప్పుడిప్పుడే మొదలవుతున్న పరిశీలన



మోర్తాడ్‌లో లే అవుట్ కాని ఇళ్ల స్థలాలను సర్వే చేస్తున్న అధికారులు

మార్చి 31 వరకు ఫీజులో 25 శాతం రాయితీని పొంది ప్రభుత్వ ఖజానాకు సొమ్ము జమ చేసిన వారి దరఖాస్తుల పరిశీలన క్షేత్ర స్థాయిలో మొదలైంది. మొదటి దశలో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ఉద్యోగులు దరఖాస్తులను పరిశీలించి ఇంటి స్థలం ఫొటోను తీసుకుని రెండో దశ పరిశీలన కోసం రెవెన్యూ అధికారులకు పంపిస్తున్నారు. రెండో దశలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈలు పరిశీలించి నివేదికను అందించాల్సి ఉంది. ఈ రెండు దశలు పూర్తయిన తరువాత జిల్లా స్థాయిలో పరిశీలన చేపట్టి ప్రొసిడింగ్‌ను జారీ చేయనున్నారు. రెండు దశల్లో పరిశీలన, మూడో దశలో ప్రొసిడింగ్‌ను జారీ చేసిన తరువాతనే ఫీజును దరఖాస్తుదారులు ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉండగా, ప్రభుత్వం మూడు దశల పరిశీలనను పక్కన పెట్టి ఫీజు జమ చేయించుకోవడం గమనార్హం.

తిరస్కరిస్తే 10 శాతం నష్టం

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ముందస్తుగా చెల్లించగా, ఏ ఒక్క దశలో దరఖాస్తు తిరస్కరించినా ఫీజులో 10 శాతం మినహాయించుకొని మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రిఫండ్ చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ముందుగానే దరఖాస్తులను పరిశీలించి ఆ తరువాత ఫీజు వసూలు చేస్తే దరఖాస్తుదారులకు ఎలాంటి నష్టం ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మొదటి దశ సర్వే పూర్తి చేస్తున్నాం

ఫీజు చెల్లించిన వారికి సంబంధించి మొదటి దశ పరిశీలన పూర్తి చేస్తున్నాం. రెండో దశలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలన చేసి క్లీన్‌చీట్ ఇవ్వాల్సి ఉంది. మూడో దశలో మరోసారి దరఖాస్తులను పరిశీలించి ప్రొసిడింగ్ కాపీలను అందించనున్నారు. మరోసారి రాయితీ అవకాశం కల్పించినందున ఫీజు చెల్లించని వారు సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీధర్, ఎంపీవో, మోర్తాడ్

తప్పని ఎదురుచూపులు

- ముందుకు సాగని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్, ఏఎన్‌ఎం పోస్టుల భర్తీ
- మరింత ఆలస్యమవుతున్న నియామకాల ప్రక్రియ
- కరోనా కాలంలో సేవలందించిన వారికి అవకాశం ఇవ్వాలని వినతి

నిజామాబాద్‌నాగారం: వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం పోస్టుల భర్తీ ప్రక్రియ మరింత ఆలస్యం అవుతోంది. 30 స్టాఫ్‌నర్స్, మూడు ఏఎన్ఎం పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు గతేడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ అయ్యింది. స్టాఫ్‌నర్స్ పోస్టులకు 876 మంది. ఏఎన్ఎం పోస్టులకు 328 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారందరూ 14 నెలలుగా వైద్యారోగ్యశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అప్పటి డీఎంహెచ్‌వో సుదర్శనం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో కాలయాపన చేశారని, మెరిట్ జాబితాను రూపొందించలేదనే ఆరోపణలున్నాయి.

ఆ తరువాత సుదర్శనం రిటైర్ కావడం, పార్లమెంట్ ఎన్నికల కోడ్, మూడు నెలలపాటు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కొనసాగడం తదితర కారణాలతో పోస్టుల భర్తీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. 2024 ఆగస్టులో డీఎంహెచ్‌వోగా రాజశ్రీ బాధ్యతలు చేపట్టినప్పటికీ.. ఉద్యోగుల బదిలీలు, పట్టభద్రుల ఎన్నికల కోడ్ కారణంగా పోస్టుల భర్తీ ప్రక్రియ ముందుకు సాగలేదు.



మాకు అవకాశం ఇవ్వండి..

కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో సేవలందించిన తమకు అవకాశం కల్పించాలని తొమ్మిది మంది స్టాఫ్ నర్సులు కోరుతున్నారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి విన్నవించగా వారు ఓకే చెప్పారు. ఆ తరువాత జిల్లా కలెక్టర్‌తోపాటు డీఎంహెచ్‌వోను సైతం నర్సులు కలిసి విన్నవించారు. ఐదేళ్లపాటు జీజీహెచ్‌లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించామని, కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేసినందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూనే ఉన్నారు. కరోనా సమయంలో విధులు నిర్వర్తించిన వారికి వేరే జిల్లాల్లో అవకాశం ఇచ్చారని, ఇక్కడ కూడా ఇవ్వాలని అంటున్నారు.

ఆలస్యంపై ఆందోళన

ప్రభుత్వం పరిధిలో పని చేయాలని ఆశించిన వారు మెరిట్ జాబితా రూపకల్పన జాప్యం కావడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఏడాది గడిచినా స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం పోస్టుల భర్తీ ప్రక్రియ ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్‌లో కన్నా ప్రభుత్వ శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అయినా ఉద్యోగానికి కొంత భరోసా ఉంటుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అనుమతి రాగానే భర్తీ చేస్తాం

మెరిట్ జాబితా సిద్ధం చేశాం. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాతా ఏడాది గడిస్తే ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే అనుమతి కోసం లేఖ రాయడం జరిగింది. కరోనా సమయంలో విధులు నిర్వర్తించిన వారి విషయాన్ని కూడా ఉన్నతాధికారులకు విన్నవించాం. అనుమతి రాగానే వెంటనే భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తాం.

– బద్దం రాజశ్రీ, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

16 నుంచి ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ థియరీ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ కే సంపత్‌కుమార్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www. telangana university.ac.inను సందర్శించాలని ఆయన సూచించారు.

23 నుంచి ఇంటిగ్రేటెడ్‌ పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్‌ పీజీ (ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్‌) 6, 8, 10వ సెమిస్టర్‌ థియరీ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ కే సంపత్‌కుమార్‌ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌

నవీపేట: మండలంలోని నవీపేట, నాగేపూర్‌, బినోల, నిజాంపూర్‌, నాళేశ్వర్‌ గ్రామాలలో సొసైటీలు, ఐకేపీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్‌ కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ శనివారం తనిఖీ చేశారు. హమాలీ, గన్నీ బ్యాగ్‌, లారీల కొరత తదితర సమస్యలను రైతులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్న నేపథ్యంలో తూకం చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపాలని సూచించారు. డీసీవో శ్రీనివాస్‌రావు ఉన్నారు.

మున్సిపల్‌ సిబ్బంది హక్కులను హరించొద్దు

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో సెలవు రోజుల్లో కూడా సిబ్బందితో పనిచేయిస్తూ వారి హక్కులను హరిస్తున్నారని మానవ హక్కుల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మానవ హక్కుల నాయకుడు పులి జైపాల్‌ మాట్లాడుతూ బల్దియాలో పన్నుల వసూళ్ల పేరిట కార్మికులు, సిబ్బందిని సెలవు రోజుల్లో సైతం పనులు చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. నెలంతా పనులు చేయించుకుంటూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. ఇకనైనా అధికారులు లేబర్‌ చట్టాలను గౌరవించాలన్నారు. సమావేశంలో నాయకులు జగన్‌, నీలగిరి రాజు, మల్లాని శివ తదితరులు పాల్గొన్నారు.

జై శ్రీరాం.. వీర హనుమాన్‌


కంఠేశ్వర్‌ వాటర్‌ ట్యాంక్‌ వద్ద భక్తుల సందడి


సుభాష్‌నగర్‌ వద్ద నృత్యాలు చేస్తున్న భక్తులు


శోభాయాత్రలో ఏర్పాటు చేసిన దేవుళ్ల ప్రతిమలు

- శోభాయమానంగా విజయయాత్ర
- కాషాయమయమైన ఇందూరు వీధులు

నిజామాబాద్‌ రూరల్‌: హనుమాన్‌ జయంతిని పురస్కరించుకొని హిందూవాహిని, బజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో శనివారం నగరంలో హనుమాన్‌ విజయయాత్రను ఘనంగా నిర్వహించారు. నీలకంఠేశ్వర ఆలయం వద్ద శోభాయాత్ర రథానికి ఎంపీ ధర్మపురి అర్వింద్‌ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కంఠేశ్వర్‌, సుభాష్‌నగర్‌, హమాల్‌వాడీ, దేవీరోడ్‌, గాంధీ చౌక్‌, నెహ్రూ పార్క్‌ చౌరస్తా మీదుగా ఆర్‌ఆర్‌ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. విజయయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ధార్మిక పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. జై శ్రీరాం.. వీర హనుమాన్‌ నినాదాలు మార్మోగాయి. హనుమాన్‌ శోభాయాత్రతో ఇందూరు వీధులన్నీ కాషాయమయం అయ్యాయి. హనుమాన్‌, శ్రీ రాముడు, పరమశివుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్‌, దత్తాత్రేయ స్వామి, భరతమాత భారీ ప్రతిమలు శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రోటరీ క్లబ్‌ జేమ్స్‌ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ నిర్వహించారు. ర్యాలీలో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, నుడా చైర్మన్‌ కేశ వేణు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు రత్నాకర్‌, విశ్వహిందూ పరిషత్‌ విభాగ్‌ కార్యదర్శి దయానంద్‌, జిల్లా సహాయ కార్యదర్శి దాత్రిక రమేశ్‌, బజరంగ్‌దళ్‌ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు


కాషాయ జెండాతో భక్తుడి విన్యాసం

1500 మంది పోలీసులతో బందోబస్తు

- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

ఖలీల్‌వాడి: నగరంలో శనివారం నిర్వహించిన హనుమాన్‌ శోభాయాత్ర ర్యాలీ ఏర్పాట్లను పోలీస్‌ కమిషనర్‌ పీ సాయిచైతన్య పరిశీలించారు. సీపీ కార్యాలయంలోని కమాండ్‌ కంట్రోల్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన 225 సీసీ కెమెరాల పుటేజీ విభాగాల ద్వారా హనుమాన్‌ శోభాయాత్రను వీక్షించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 34 హనుమాన్‌ జయంతి ర్యాలీలు జరిగినట్లు చెప్పారు.



నంబర్‌ ప్లేట్‌ మార్చాల్సిందే!

- పాత వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం
- సెప్టెంబర్‌ 30 వరకు గడువు



ఖలీల్‌వాడి: ఓల్డ్‌ వెహికిల్‌ వాడుతున్నారా? ఆ వాహనం 2019 ఏప్రిల్‌ 1కి కంటే ముందు తయారైందా? అయితే.. దీనికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్‌ ప్లేట్‌ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) పెట్టుకోవాల్సి వస్తుంది. బైక్‌ల నుంచి ఫోర్‌ వీల్స్‌ వరకు ఏదైనా తప్పనిసరిగా ఈ నంబర్‌ ప్లేట్‌ను పెట్టుకోవాలి. ఈమేరకు రాష్ట్ర రవాణాశాఖ ఇటీవల గెజిట్‌ నోటిఫికేషన్‌ విడుదల చేసింది. అలాగే గడువును ఈ ఏడాది సెప్టెంబర్‌ 30న చివరి తేదీగా నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రవాణాశాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. నకిలీ నంబర్‌ ప్లేట్లను, వాహనాల చోరీలను అరికట్టడంతోపాటు రహదారి భద్రత లక్ష్యంగా నెంబర్‌ ప్లేట్‌లను ఏర్పాటు చేయనున్నారు.

లేకుంటే కేసులే..

పాత వాహనాలకు కొత్త నంబర్‌ ప్లేట్‌ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. లేకుంటే సదరు వాహనం అమ్మాలన్నా...కొనాలన్నా ఆర్టీఏ ఆఫీసులో పేరు మార్చుకోవడానికి వీలు ఉండదు. ఈ వాహనానికి ఇన్సూరెన్స్‌, పొల్యూషన్‌ సర్టిఫికెట్‌ ఇవ్వరు. హై సెక్యూరిటీ నంబర్‌ ప్లేట్‌ లేకుంటే కేసు నమోదు చేస్తారు.

జిల్లాలో 10, 700లకు పైగా వాహనాలు

జిల్లాలో 2019, ఏప్రిల్‌ 1కంటే ముందు 10,700 లకుపైగా వాహనాలు ఉన్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలు, ఫోర్‌వీలర్స్‌, త్రీవీలర్స్‌, కమర్షియల్‌ వెహికిల్స్‌ ఉన్నాయి. ఈ వాహనాలన్నింటికీ హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

వివిధ రకాల వాహనాలకు ధరలు ఇలా..

వాహన రకం	నంబర్‌ ప్లేట్‌ ధరలు
టూ వీలర్స్‌	రూ.320-380
త్రీవీలర్స్‌	రూ.350-450
ఫోర్‌ వీలర్స్‌	రూ.590-700
కమర్షియల్‌ వెహికిల్స్‌	రూ.600-800

ఆన్‌లైన్‌లో బుకింగ్‌..

హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్‌ ప్లేట్‌ కోసం www. siam.in వెబ్‌సైట్‌లో వెహికిల్‌ వివరాలు నమోదు చేసి బుక్‌ చేసుకోవాలి. కొత్త ప్లేట్‌ బిగించాక ఆ ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుంది. వీటిని ఆర్టీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంచి నంబర్‌ప్లేట్లను బిగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై జిల్లా రవాణాశాఖ అధికారి ఉమమహేశ్వర్‌రావును వివరణ కోరగా రాష్ట్ర రవాణాశాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేవన్నారు. ఉత్తర్వులు అందిన వెంటనే హైసెక్యూరిటీ నెంబర్‌ ప్లేట్‌లు బిగించేందుకు ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

మహిళలే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాతలు


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్‌ మనోజ


మనోజను సత్కరిస్తున్న తెయూ వీసీ ప్రొఫెసర్‌ యాదగిరి, ఉమెన్‌ సెల్‌ డైరెక్టర్‌ భ్రమరాంబిక

- పాలమూరు వర్సిటీ ప్రొఫెసర్‌ మనోజ

తెయూ(డిచ్‌పల్లి): మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పాలమూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌ మనోజ పేర్కొన్నారు. మహనీయుల జయంతి వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ వర్సిటీ ఉమెన్‌ సెల్‌ డైరెక్టర్‌ భ్రమరాంబిక అధ్యక్షతన 'స్త్రీల హక్కులు– లింగ న్యాయం' అనే అంశంపై శనివారం కార్యశాల నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన ప్రొఫెసర్‌ మనోజ మాట్లాడుతూ.. మహిళల హక్కులు, రక్షణ చట్టాలు, హిందూ వివాహ వ్యవస్థపై అంబేడ్కర్‌ చేసిన కృషితోనే దేశంలో మహిళల పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. కుటుంబ వ్యవస్థలో సమానమైన ఆస్తి మహిళలకు లభించాలన్న హిందూ కోడ్‌ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా, బిల్లు వీగిపోవడంతో నిరసనగా అంబేడ్కర్‌ తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పురుషులతో సమానంగా స్త్రీలకు వేతనాలు చెల్లించే చట్టాలు, స్త్రీలను గౌరవించి ప్రసూతి సెలవులను ఇప్పించే చట్టాలను చేయడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. యువత పెడధోరణులు పడుతున్న నేపథ్యంలో వర్తమాన సమాజంలో స్త్రీల హక్కులు, లింగ న్యాయం అనే అంశం చర్చించడం అత్యావసరమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ టీ యాదగిరి రావు పేర్కొన్నారు. వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ రచనలను అధ్యయనం చేయాలన్నారు. అనంతరం ప్రొఫెసర్‌ మనోజను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌ మామిడాల, రిసోర్స్‌ పర్సన్‌ స్రవంతి, కామర్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ రాంబాబు, సీవోఈ ప్రొఫెసర్‌ సంపత్‌కుమార్‌, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్‌ కానిస్టేబుల్‌ మృతి



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాంచందర్‌ (50) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. నిజామాబాద్‌లో నివాసం ఉంటున్న రాంచందర్‌ నాలుగు రోజుల క్రితం బ్రెయిన్‌ స్ట్రోక్‌కు గురికాగా చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతున్న రాంచందర్‌కు శనివారం గుండెపోటు రావడంతో మరణించాడు. మూడేళ్లుగా జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రాంచందర్‌ స్వస్థలం కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్‌ తండా. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రాంచందర్‌ మృతి పట్ల జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, ఏఎస్సైలు వెంకట్‌కుమార్‌, సుశీల్‌కుమార్‌, సిబ్బంది వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

బాలికకు చిత్రహింసలు

- తండ్రి, సవతి తల్లిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: రెండో భార్యతో కలిసి కన్న కూతురిని చిత్రహింసలకు గురిచేసిన ఘటన నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఈ కేసులో తండ్రితోపాటు సవతి తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్‌ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నాగారం గోశాలకు చెందిన షేక్‌ హుస్సేన్‌ మొదటి భార్య అమ్మదీ బేగం నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ఒక కుమార్తె(13) ఉంది. రిజ్వానా బేగంను హుస్సేన్‌ రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. రెండో వివాహం అయినప్పటి నుంచి బాలికను బడి మాన్పించి, ఇంటి పనులు చేయిస్తూ నరకం చూపిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకే నిద్రలేపి ఇంటి పని చేయించేవారు. పాచిపోయిన అన్నం పెడుతూ కొట్టేవారు. బంధువుల ఇంటికి కూడా వెళ్లనిచ్చేవారు కాదు. ఈ నెల 8న హుస్సేన్‌, రిజ్వానా బేగంలు బాలికను భైంసాలోని వరసకు అత్తమ్మ అయిన వజీర్‌బీ ఇంటి ఎదుట వదిలేసి వెళ్లిపోయారు. దీంతో వజీర్‌బీ ప్రస్తుతం ఆ బాలికను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. బాలిక మామ షేక్‌ హయాత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్‌ వెల్లడించారు.

క్రైం కార్నర్‌

ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ నిర్వాహకుడి అరెస్ట్‌



ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్‌ పరిధి లతీఫ్‌ కాలనీకి చెందిన ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ నిర్వాహకుడు షేక్‌ ఆసిఫ్‌ అలీని పోలీసులు పట్టుకున్నారు. సీఐ సురేశ్‌కుమార్‌ శనివారం వివరాలు వెల్లడించారు. అర్సపల్లి బైపాస్‌ రోడ్డులోని ఇండియన్‌ పెట్రోల్‌ బంక్‌ వద్ద ఆసిఫ్‌ అలీని పట్టుకోగా, అప్పటికే నిందితుడు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, కొంత మంది యువకులకు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపి వారితో క్రికెట్‌ బెట్టింగ్‌ ఆడించేవాడినని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఆసిఫ్‌ అలీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

కార్లను ఢీ కొట్టిన ఆటో డ్రైవర్‌

భిక్కనూరు: మద్యం మత్తులో ఇంటి ముందు నిలిపిన కార్లను శనివారం ఓ ఆటో డ్రైవర్‌ ఢీ కొట్టినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. భిక్కనూరులో జరుగుతున్న పెద్దమ్మ ఉత్సవాలకు గ్రామానికి చెందిన పున్న లక్ష్మీనారాయణ బంధువులు వచ్చారు. వారికి చెందిన రెండు కార్లను ఇంటి ఎదుట నిలిపి ఉంచగా, మండల కేంద్రానికి చెందిన బాబు అనే ఆటో డ్రైవర్‌ మద్యం సేవించి అజాగ్రత్తగా ఆటో నడిపి కార్లను ఢీకొట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఒకరిపై ఇసుక మాఫియా దాడి

రెంజల్‌(బోధన్‌): మండలంలోని పేపర్‌మిల్‌ గ్రామంలో ఇసుక మాఫియా ఓ వ్యక్తిని తీవ్రంగా చితకబాదింది. ఈ నెల 3న నిజామాబాద్‌ రూరల్‌ పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెంజల్‌ మండలానికి చెందిన మూడు టిప్పర్లను పట్టుకున్నారు. టిప్పర్లు పట్టుబడేందుకు గ్రామానికి చెందిన వ్యక్తి కారణమని అనుమానించిన మాఫియా శనివారం అతన్ని పట్టుకొని దాడిచేశారని గ్రామస్తుల ద్వారా తెలిసింది. కొందరు పోలీసులు ఉపేక్షించడంతో దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై చంద్రమోహన్‌ను వివరణగా కోరగా పరస్పరం దాడి చేసుకొని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈత వనం దగ్ధం



మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌లో శనివారం ఈత వనం దగ్ధమైంది. గౌడ సంఘం ఆధ్వర్యంలో వారి సొంత భూమిలో ఈత చెట్లను పెంచుతున్నారు. కాపలా ఉన్న వ్యక్తి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా తిరిగి వచ్చేంతలోపే ఈత వనానికి నిప్పంటుకుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఈత వనంలో దాదాపు 100 చెట్లు కాలిపోయాయి. చెట్లు కాలిపోవడంతో తమ ఉపాధిపై దెబ్బ పడిందని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి కమిటీతో వివాదం కొనసాగుతున్న ఈ తరుణంలో ఈతవనం దగ్ధంపై అనేక సందేహాలు నెలకొన్నాయి. గీత కార్మికుల ఫిర్యాదు మేరకు భీమ్‌గల్‌ సీఐ సత్యనారాయణ, ఏర్గట్ల ఎస్సై రాము, ఎక్సైజ్‌ సీఐ గుండప్ప, ఎస్సై మానస ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు తీసిన చేపల వేట

- ప్రమాదవశాత్తు కుంటలో పడి ఇద్దరి దుర్మరణం
- మృతులిద్దరూ బావాబామ్మర్దులు


షేక్‌ షాదుల్లా, మహమ్మద్‌ రఫీక్‌ మృతదేహాలు

నందిపేట్‌(ఆర్మూర్‌): చేపల వేట సరదా ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ప్రమాదవశాత్తు బావాబామ్మర్దులు ఇద్దరు నీట మునిగి చనిపోయిన ఘటన నందిపేట మండలం సిద్దాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్‌ జిల్లాకు చెందిన షేక్‌ షాదుల్లా(46) తన కుటుంబంతో కలిసి 18 ఏళ్ల క్రితం ఆలూర్‌ మండలం మచ్చర్ల గ్రామానికి వచ్చి మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన అతని బావమరిది మహమ్మద్‌ రఫీక్‌(47) రంజాన్‌ పండుగ సందర్భంగా వారం క్రితం మచ్చర్లకు వచ్చాడు. కాగా, శుక్రవారం సాయంత్రం సరదాగా చేపలు పట్టేందుకు ఇద్దరూ కలిసి నందిపేట మండలంలోని సిద్దాపూర్‌ గ్రామ శివారులోని చిన్నవాగు సంబంధించిన మునికుంటకు వెళ్లారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు రఫీక్‌ కాలు జారి కుంటలో పడిపోయాడు. దీంతో అతనిని రక్షించేందుకు షాదుల్లా కుంటలోకి దిగాడు. ఇద్దరికీ ఈత రాకపోవడం, మునికుంటలో లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి మృతి చెందారు. మృతుడు షేక్‌ షాదుల్లా కొడుకు షేక్‌ సులేమాన్‌ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

హార్వెస్టర్‌ ఢీకొని ఒకరి మృతి


గంగాధర్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌ గ్రామంలో శనివారం హార్వెస్టర్‌ ఢీకొని అరిగెల గంగాధర్‌ (59) మృతి చెందినట్లు ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపారు. హనుమాన్‌ జయంతిని పురస్కరించుకొని అరిగెల గంగాధర్‌ రాజారాం నగర్‌కు చెందిన సోనారి గోవింద్‌తో కలిసి బైక్‌పై గ్రామంలోని హనుమాన్‌ ఆలయానికి వెళుతున్నారు. మార్గమధ్యలో వీరి ముందు వెళుతున్న హార్వెస్టర్‌ను డ్రైవర్‌ సింహాద్రి నిర్లక్ష్యంగా వెనక్కి తీయడంతో బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌ నడుపుతున్న గోవింద్‌ పక్కకు దూకగా, వెనుక కూర్చున్న గంగాధర్‌ హార్వెస్టర్‌ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో డిచ్‌పల్లి 30 పడకల ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు గంగాధర్‌ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి ఆవరణలో గంజాయి సాగు

- ఎక్సైజ్‌ పోలీసుల దాడి
- ఒకరి అరెస్టు.. పరారీలో మరొకరు


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్‌ పోలీసులు

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): గంజాయి మొక్కలు పెంచుతున్న వారి ఇళ్లపై ఎక్సైజ్‌ పోలీసులు శనివారం దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఎక్సైజ్‌ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాటేపల్లి తండాలో ఇద్దరు వ్యక్తులు ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు సాగు చేస్తూ అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారంతో సీఐ సత్యనారాయణ బృందంతో కలిసి తనిఖీ చేపట్టారు. భామన్‌ మధుసింగ్‌ ఇంటి ఆవరణలో 16 గంజాయి మొక్కలను కనుగొని వాటిని తొలగించి స్వాధీనం చేసుకోగా, నిందితుడు పరారయ్యాడు. మరో వ్యక్తి బర్ధవాల్‌ రాయిలా ఇంట్లో తనిఖీ చేయగా 200 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి, బర్ధవాల్‌ రాయిలాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. గంజాయి మొక్కలు పెంచినా, విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలుడి అదృశ్యం



రుద్రూర్‌: రుద్రూర్‌ మండల కేంద్రానికి చెందిన వాటిల్‌ గణేశ్‌ (16) అనే బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గణేశ్‌ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం ఉదయం బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు సమీప గ్రామాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి విజయ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్‌ వాడొద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య

రుద్రూర్‌: సెల్‌ఫోన్‌ వాడొద్దన్నందుకు యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కోటగిరి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి మండల కేంద్రానికి చెందిన బొట్టి లక్ష్మణ్‌ (20)ను అతిగా ఫోన్‌ వాడొద్దని తండ్రి బాబయ్య మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మణ్‌ శ్మశాన వాటికలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోటళ్లలో తనిఖీలు

- పరిశుభ్రత పాటించని ఫుడ్‌ మేకర్స్‌కు జరిమానా



నిజామాబాద్‌ సిటీ: నగరంలోని హోటళ్లు, ఆహార పదార్థాలు తయారుచేసే కేంద్రాలపై బల్దియా అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. కంఠేశ్వర్‌ బైపాస్‌, ముబారక్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు, గదుల శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న మూడు దుకాణాదారులకు రూ.40 వేల జరిమానా విధించినట్లు ఏఎంసీ జయకుమార్‌ తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సాదుల్లా, జవాన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.